# ఆశాకిరణం

- టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి

సదా చిరునవ్వుతో వెలిగే విజయానంద్ ముఖంలో ఆ సమయంలో ఆ నవ్వు వెలుగులేదు.

"ఫ్రెండ్స్!" అంటూ గంభీర స్వరంతో ప్రారంభమైన ఆయన ప్రసంగంలో మునుపటి మృధుమధురిమ, ఆనంద జీర అలవోకగా విన్పించడం లేదు. ఓటమికి చేరువైన యోధుడి తాలూకు స్థితి ఆయన శారీరక కదలికలలో సైతం స్పష్టంగా అవగతం అవుతోంది.

"ప్రపంచవ్యాప్తంగా ఉత్పన్నమైన పరిస్థితులవల్లా, మార్కెట్ నడకలో ఏర్పడిన అవరోధాలవల్లా... ఇంకా చెప్పాలంటే దేశంలో సైతం కొన్ని సంస్థల నిర్వాకాలవల్లా, మన కంపెనీ కూడా తీవ్రమైన ఆటుపోట్లనే చవిచూసింది... చూస్తూనే వుంది. చెప్పరానంత ఒత్తిడికి చెప్పడం నాకేమాత్రం ఇష్టం లేదు. అందువల్ల యధార్థాన్ని స్పష్టంగా చెబుతాను.

మన కంపెనీ... ఈ ఆటుపోట్లలో తట్టుకుని నిలద్రొక్కుకోవాలంటే చాలా కఠినతరమైన ప్రణాళికలను నిర్దేశించుకుని సాగక తప్పదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే... మన కంపెనీ బ్రతికిబట్టకట్టాలంటే ఉన్నఫళంగా అరవై శాతం ఉద్యోగులను తొలగించి మిగిలిన వారితో వంద శాతం పనులనూ నిర్వహించుకుంటూ రావాలి! తప్పదు!! అయితే అలాగని ఒక్క ఉద్యోగిని తొలగించడం కూడా మన సి.ఇ.ఓ.గారికి సుతరామూ ఇష్టం లేదు.


అందుకే అందరూ అనేక విధాలుగా చర్చించి, ఆలోచించి, ప్రపంచ మేధావులుగా పేరుపడ్డ వారిలో కొందరిని సంప్రదించి వారినుండీ సూచనలూ, సలహాలూ తీసుకుని చివరికి ఒక నిర్ణయానికి వచ్చాము. ఆ నిర్ణయాన్ని గూర్చి చెప్పేముందు ఒక్క విషయం తెలుసుకోవాలని అనుకుంటున్నాను..."

ఒక్క నిముషం తన ప్రసంగాన్ని ఆపి అందరికేసీ పరీక్షగా చూశాడు విజయానంద్. దాదాపు అందరూ చాల క్యూరియస్‌గా చూస్తున్నారు...

"...గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటూ, చాల క్లిష్టమైన ఆర్థిక ఇబ్బందులలో పడిపోయిన మన కంపెనీని తిరిగీ ఉన్నత స్థితికి చేర్చుకోవడానికి ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడగలిగిన వారు మీలో ఎవరైనా ఉన్నారా? ఉంటే సరిగ్గా ఐదు నిముషాల తరువాత తమతమ స్థానాలలో నిలబడ వలసినదిగా అభ్యర్థిస్తున్నాను!"

ఓ చిన్న విషాదగీరతోటే అయినా స్వచ్ఛమైన ఆంగ్లంలో సరళంగా సాగుతున్న ఆయన ప్రసంగం తాత్కాలికంగా ఆగింది. బాగా ఆలోచించుకోవడానికి ఆయన అందరికీ ఐదు నిముషాలు వ్యవధి ఇచ్చారని అర్థం చేసుకున్న నేను గబగబా ఆలోచించాను.

"ఆరు సంవత్సరాలుగా అన్నం పెడ్తున్న సంస్థ! నిజం చెప్పాలంటే అన్నం పెట్టడం కాదు... మంచి సుఖమయ జీవితాన్నిచ్చిన సంస్థ, సప్తసముద్రాలనూ సునాయాసంగా దాటి విలాసవంతమైన అవతలి ప్రపంచాన్ని అక్కడి జీవన విధానాలనూ చూసి రావడానికి అవకాశాలిచ్చిన సంస్థ!! నేడు పెను తుఫాను మధ్యన చిక్కుకుని మునిగిపోబోతున్న నౌకలా తయారయింది!



పిరికిపందలా ఎటో దూకి ప్రాణాలు కాపాడుకోవడానికి ప్రయత్నించే ప్రయాణికుడిలా కాక ధైర్యంగా చివరివరకూ నావికులకు కూడా చేతనైన సహకారాన్నందిస్తూ మృత్యువుతో పోరాడగల ధీరుడిలా నిలబడడం ధర్మం అనిపించింది నాకా క్షణాలలో!!

ముఖ్యంగా మేరు పర్వతంలాంటి విజయానంద్ నోట చివర్న విన్పించిన "అభ్యర్థిస్తున్నాను" అన్న పదం నన్ను కదిలించింది... కంట తడి తెప్పించింది కూడా!

అందుకే మూడు నిముషాలయినా పూర్తికాక మునుపే లేచి నిలబడ్డాను నిటారుగా... నిలబడ్డమే కాదు నా కుడి చేతిని కూడా ఆకాశంవైపు పొడవుగా చాపాను ఉద్వేగంగా!

నిజానికి నా గుండె ద్రవిస్తోంది... విజయానందనూ, అతని ప్రక్కనే కూర్చునివున్న డైరెక్టర్లిద్దరినీ చూస్తుంటే! మా సంస్థతో, మాతో వారి బంధం అలాంటిది.

ఐదు నిముషాలు పూర్తికాకమునుపే నా సహోద్యోగులలో దాదాపు ఏభయి శాతం మంది లేచి నిలబడడం కన్పించింది. ఐదు నిముషాల తరువాత దాదాపు మరో ముప్పయి శాతం మంది కూడా... ...

"చాల సంతోషం... సోదరీ సోదరులారా! దయచేసి అందరూ కూర్చోండి!" అన్నాడు విజయానంద్. అప్పుడతని కళ్ళు మెరుస్తున్నట్లుగా అన్పించింది నాకు. వాస్తవమో?... లేక... నా భ్రమో?? నిర్ధారించుకోలేకపోయాను.

అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నాక ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించారు.

"స్నేహితులారా! రాబోయే మూడు నెలలు మాత్రమే మీకందరికి పూర్తిస్థాయిలో జీతాలు ఇవ్వబడ్తాయి. నాలుగవ నెల నుండీ ప్రతి ఉద్యోగికీ... అంటే అటెండరు నుండీ సి.ఇ.ఓ. వరకూ కూడా ప్రతి ఒక్కరికీ ఇప్పుడు వారు, పొందుతున్న జీతంలో నలభై శాతం మాత్రమే జీతంగా చెల్లింపబడ్తుంది. అంతకుమించి చెల్లించగల స్థితిలో మన కంపెనీ లేదు ప్రస్తుతం. అలవెన్సులు సైతం ఆమేరకే ఖచ్చితంగా కుదించబడ్తాయి.

తగ్గించబడ్డ జీతభత్యాలతో జీవనం గడవడం చాల మందికి క్లిష్టం కావచ్చు. అయినా ప్రతి ఒక్కరూ కూడా కష్టపడి సంస్థను ముందుకు తీసుకుపోవడానికి ఒకటి రెండు గంటలు అదనంగా కూడా పని చెయ్యాల్సి ఉంటుంది. అంటే పని గంటలలో మార్పు ఉంటుందన్న మాట. ఇకపై సంస్థ పని కాలం ప్రతి రోజూ ఒక గంట ముందుగా ప్రారంభంఅయి ఒక గంట ఆలస్యంగా ముగుస్తుంది. అలాగే అత్యవసరం అయినప్పుడు ఆదివారాలలో కూడా కొన్ని గంటలు పనిచెయ్యాల్సి రావచ్చును.

దీనికంతటికీ ఇష్టపడ్డవారు మాతో కలిసి ముందుకు సాగుతారు. సుముఖంగా లేనివారు ఈ మూడు నెలలలోపు ఎప్పుడైనా సంస్థను వదిలి వెళ్ళిపోవచ్చును. ఆ విధంగా వెళ్ళిపోవడానికి వీలుగా అగ్రిమెంట్లులో సవరణలు చెయ్యబడ్తాయి.

స్నేహితులుగా కలుసుకున్న మనం విడిపోయేవారికి స్నేహంగానే వీడ్కోలిద్దాం.

సంస్థ ఆర్థిక పరిస్థితి చక్కబడి పుంజుకోగానే ఫలితాల్ని తదనుగుణంగా సవరించడం జరుగుతుంది... మనందరం కలిసి శ్రమపడ్తే మన సంస్థను ఉన్నత

పథంలోనికి తీసుకువెళ్ళడం పెద్ద కష్టం కాదని భావిస్తున్నాము!"

విజయానంద్ ప్రసంగం ముగిసింది.

కరతాళ ధ్వనులలో మునుపటి ఉత్సాహమే విన్పించింది నాకు.

* * *

సుమిత్రతో దాదాపు ఖాయం అయిపోయిందనుకున్న నా వివాహం ఆగిపోవడం నిజంగా ఆశ్చర్యమే!

నాకన్నా ఎక్కువ సంపాదనాపరుడు లేదా ఆస్తిపరుడు సుమిత్రకు వరుడుగా లభ్యంకావచ్చునేమో? కానీ ఒక మంచి కుటుంబంతోటే వియ్యం లభ్యమవుతుందన్న గ్యారంటీ ఉండకపోవచ్చు.

ఎందుకంటే మాది ఒక మంచి కుటుంబం అనే చెప్పుకోవచ్చు. మా కుటుంబంతో ఎన్నో సంవత్సరాలుగా పరిచయం కలిగివున్న సుమిత్ర తండ్రి ఆ కాస్తా ఆలోచింపక పోవడమే మహదాశ్చర్యం.

పోతే మా కంపెనీ పరిస్థితి గురించి న్యూస్ పేపర్లలో, న్యూస్ ఛానెళ్లలో పుంఖాను పుంఖాలుగా వార్తలు వచ్చిన తరువాత ప్రతీదీ ఆశ్చర్యమేలయి కూర్చుంది.

అంతకుమునుపు లక్షలాది రూపాయలు కట్నకానుకలు కుమ్మరిస్తామంటూ కూడా మా ఇంటి చుట్టూ ప్రదక్షిణాలు చేసినవారు దుర్భిణీ వేసి వెతికినా కూడా కానరాకుండా పోయారు. అంతేకాదు కట్నం మాట దేముడెరుగు... బిడ్డనివ్వడానికి ఇష్టపడేవారూ కరువయినట్లే తయారయింది పరిస్థితి త్వరలోనే!

పెళ్ళిమాట అటుంచితే... మా నాన్న దిగులుపడిపోయారు.

అంత కాలం నా జీతంతో మా కుటుంబం దర్జాగా జీవించడమే కాదు.. చెల్లి చదువు సైతం ఎలాంటి ఆటంకాలూ లేకుండా సాగిపోతూ వచ్చింది. మా నాన్నగారు తమకు వచ్చే పెన్షన్‌లో సగం చెల్లి పెండ్లి నిమిత్తం డిపాజిట్ చేస్తూ తతిమ్మా సగం తమ తల్లిదండ్రులకు పంపుతూ ఉండేవారు.

కేవలం నష్టాల్నే తెచ్చిపెట్టే వ్యాపారంలా తయారయిన వ్యవసాయపు పనులనూ, మిగిలివున్న కొద్దిపాటి నేలనూ, పల్లెలోని ఇంటినీ, ఆ వాతావరణాన్నీ వదిలి రాలేరు వారు.

పట్టణాలలో నివసిస్తూ నగర జీవన యానానికి అలవాటుపడి ఇక్కడ స్థిరపడిపోయిన మేం మా పల్లెకు ఇక శాశ్వతంగా వెళ్ళడం మాత్రం కల్ల.

"భయపడకండి! అనవసరమైన ఖర్చులన్నీ తగ్గించుకుని అత్యవసరమైన ఖర్చులకే పరిమితమవుదాం. అలా నా జీతంతోటే నెట్టుకొచ్చే ప్రయత్నం చేద్దాం. మీ పెన్షన్ యధాప్రకారంగానే చెల్లి పేరిట సగంవేసి తాతగారికి మిగిలిన సగం పంపుతుండండి!" అని ధైర్యం చెప్పాను.

మా అమ్మకూడా అదే చెప్పింది. దాంతో కాస్త ఊరట చెందారు మా నాన్నగారు.

* * *

ప్రతినెలా లక్షలాది రూపాయలు అద్దె రూపేణా మ్రింగి నీళ్ళు త్రాగుతుండిన పెద్ద అరిస్టోక్రటిక్ భవంతిలోని ఏడవ అంతస్తు నుండీ మా కంపెనీ ఒక సాధారణ భవంతిలోని మూడవ అంతస్తులోకి మారిపోయింది. నిజానికి ఈ సాధారణ భవనమే సౌకర్యవంతంగా వుంది! ఎటొచ్చీ లిఫ్టు సౌకర్యం లేదు... మెట్లెక్కాల్సిందే!!

"త్వరలోనే నా చిరుబొజ్జ కరిగిపోతుంది!" అని అనుకుంటూ ప్రవేశించాను క్రొత్త ఆఫీసులోకి.

ఆపై మార్పులు చకచకా వాటంతట అవే చోటుచేసుకుంటూ వచ్చేశాయి.

డెబ్బయి వేలకు కొని వుండిన మోటర్ సైకిల్‌ను నలభైఅయిదు వేలకు అమ్మి ఓ బరువు దించుకున్నాను. ఇంట్లో ఉండిన లాప్‌టాప్, ప్రింటర్ మరో నలభై అయిదు వేలకు అమ్మివేసి మరో బాకీ బరువు దించుకున్నాను.

అదృష్టవశాత్తు చెల్లికి ఓ జాతీయ బ్యాంకు ఎడ్యుకేషన్ లోన్ శాంక్షన్ చేసి పుణ్యం కట్టుకుంది.

పబ్బులు, సినిమాలు, షికార్లు అప్పటికేపోయాయి. ఆదివారాల్లో స్నేహితుల రాకపోకలు సైతం బాగా తగ్గిపోయాయి.

ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని ఆఫీసుకు రెండు బస్సులు మారి సకాలంలో చేరుకోవడం పెద్ద కష్టం అయిపోయింది. అయినా బాధనిపించడం లేదు. పైగా ఏదో రిలీఫ్‌గా కూడా అన్పిస్తోంది.

ఓరోజు బంద్ జరిగింది. అయితే అర్జంటు పని ఉన్నందున తప్పనిసరిగా ఆఫీసుకు వెళ్ళాల్సి వచ్చి అడ్డదారిన నడచుకుంటూ వెళ్ళాను.

ఆరోజు నా ఆశ్చర్యానికి అంతులేదు. అడ్డదారిన ఆఫీసు పట్టుమని మూడు కిలోమీటర్ల దూరం కూడా లేదు.

ఆరోజు పడింది నా దృష్టి... ఇంటి మెట్ల క్రింద చిలుం పట్టిపోయి దుస్థితిలోవున్న రాబిన్‌హుడ్ సైకిలు మీద...

దాన్ని తోసుకుంటూ ఓ సైకిలుషాపుకు వెళ్ళాను మరుసటిరోజు.

"సార్, ఈ సైకిలు నాకిచ్చేస్తారా? మంచి రేటే ఇస్తాను!" అన్నాడు షాపతను సైకిలు ఫ్రేము ఫోర్కులను పరిశీలించి.

"మా నాన్నగారి హైస్కూలు రోజులలో వారికి మా తాతగారు తీసి ఇచ్చిన సైకిలట ఇది. దీన్ని అమ్మితే మా నాన్నగారు, మా తాతగారు ఇద్దరూ కలసి చంపేస్తారు నన్ను!" అన్నాను నవ్వి.

"అలాగా! అయి రెండ్రోజులాగి రండి... ఓవరాల్ చేయించి పెడ్తాను. బిల్ కాస్త ఎక్కువే అవుతుంది!" అన్నాడు.

అతడన్నట్లే క్రొత్త సైకిల్ ధరలో సగం అయింది సైకిలు రిపేరీకి. బిల్లు, చెల్లించడాన్కి బాధపడ్డా... స్మూత్‌గా పరిగెడుతున్న సైకిలు మీద ఇంటికి తిరిగి వస్తుంటే ప్రాణానికి చాల హాయనిపించింది.

మరునాడు దానిమీద అడ్డదారిన ఆఫీసుకు వెళుతోంటే మరింత హాయనిపించింది... పెట్రోలు ఖర్చు లేకుండానే మోటారు సైకిలుమీద వెళ్తున్నట్లే అన్పించడంతో!


పైగా మోటారు సైకిలు మీద మెయిన్ రోడ్డులో వెళ్ళినా ఆఫీసుకు అంత త్వరగా వెళ్ళివుండలేను నిజానికి.


ట్రాఫిక్ ఇబ్బంది లేదు, డిస్టబెన్సు అంతకన్నా లేదు... అడుగు మోపడానికున్నంత సందున్నా అందులోంచీ సైకిలు వెళ్ళిపోగలుగుతోంది సునాయాసంగా, దర్జాగా.

నన్ను చూసి నా కొలీగ్స్ చాలమంది క్రొత్త సైకిళ్ళు కొనుక్కున్నారు... "ఏం సైకిలెక్కావు?" అని అడిగిన వారికి "అనవసరంగా పెరుగుతున్న బొజ్జ తగ్గించుకోవడంకోసం" అని చెప్తున్నారు.

"కంపెనీ డౌన్ ఫాల్ అయ్యేసరికి నీవూ సైకిలుకు దిగజారావా?" అని పరిహాసంగా నవ్వేస్తూ అడిగాడు ఓ బంధువు నన్నోరోజు.

(మిగతా 27వ పేజీలో)



(19వ పేజీ తరువాయి)

"దిగజారిన కంపెనీ ప్రతిష్టను ఎగదొయ్యడానికి, నా కుటుంబాన్ని, నా దేశాన్ని... ఇంకా చెప్పాలంటే ఈ ప్రపంచాన్ని రక్షించుకోవడానికి సైకిలెక్కాను!" అన్నాను నిస్సంకోచంగా.

ఆ సమయంలో నా కంఠ స్వరంలో ఒకింత గర్వం చూచాయగా ధ్వనించింది. నేనంత ధీమాగా బదులివ్వ గలగడానికి వెనుక ఓ మంచి నేపథ్యం ఉంది మరి... ...

* * *

పెట్రోలు ఖర్చులేదు..

ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాదు నా దారిన...

పెరుగుతుండిన చిరుబొజ్జ కాస్తా కరిగిపోతోంది..

మా కంపెనీలో చాలమంది నన్నాదర్శనం చేసుకుని నా దారిలోకే వస్తున్నారు...

అయినా నా మనసులో ఏ మూలనో కన్పించీ కన్పిం చనట్లుగా, లీలగా ఆత్మన్యూనతా భావం... అది తుడిచి పెట్టుకుపోవడానికి నేను ఠీవిగా తలెత్తుకుని ఆత్మవిశ్వా సంతో నిలబడడానికి క్రొత్తగా కన్పించిన ఆశాకిరణం... సుగాత్రి!

* * *

సుగాత్రి వాళ్ళు చాలకాలం క్రితమే మా ఎదురిల్లు కొనుక్కున్నారు. అందువల్ల చాల ఏళ్ళుగా మా పొరు గువారు.

సుగాత్రి అందమైనదే... అయితే నన్నెప్పుడూ కన్నెత్తి చూడలేదు.

ఎదురిల్లే కాబట్టి అప్పుడప్పుడు మా ఇంటికి వచ్చి అమ్మతో మాట్లాడి వెళ్తుండేది. కానయితే పన్నెత్తి నన్నే నాడూ పలకరించిన పాపాన పోయింది కాదు... నేనూ అంతే... నిజం చెప్పాలంటే నాకెందుకో పెద్ద ఆసక్తిలేదు తన మీద.

ఎక్కువగా లంగా, వోణీలలో, అప్పుడప్పుడు చీరలో కన్పించే ఆ నొక్కులజుత్తు జడ పిల్లకన్నా... ప్రతిజ్ఞపట్టిన ద్రౌపదిలా జుత్తులు విరబోసుకుని, సదా మగరాయుళ్ళలా ప్యాంటు షర్టులు, జీన్స్ డ్రెస్సులు వేసుకుని తిరిగే ఆడపిల్లలే నన్నెక్కువగా ఆకర్షించేవారు నిజానికి.

అరవయి శాతం జీతం తగ్గాక ఆ ఆసక్తీ తగ్గింది.

ఆ ఫేసులో నేనొక విషయం గ్రహించాను.

ఏనాడూ కన్నెత్తి చూడని సుగాత్రి నాకేసి చూస్తోంది తరచుగా. పైగా అప్పుడప్పుడు ఆమె పెదవులు నవ్వు తున్నాయి కూడా... అయితే పరిహాసంగా మాత్రం కాదు!

అప్పుడు పరిశీలించాను...

ఆమె వంపుల జుత్తులో విశాల ఫాలభాగంలో, కళ్ళ వెలుగుల్లో, కోటేరులాంటి ముక్కులో, ముత్యాలు జాలువారుతున్నట్లు మెరిసే పలు వరసల్లో, చెర్రీ రంగుతో లేతగా కన్పించే పెదవుల నవ్వులో, నడకలో, ప్రతి కదలికలో, ప్రతి భంగిమలో కన్పించే అందచం దాలను...

అప్పుడు పెరిగింది ఆసక్తి!

ఓ ఆదివారం ఓ చిన్న క్యారియర్ బాక్సులో జున్ను పట్టుకు వచ్చింది తను మా ఇంటికి. నిజం చెప్పాలంటే తనే ఓ జున్ను ముక్కలా కన్పించింది నా కళ్ళకు ఆనాడు.



**ఏనాడూ కన్నెత్తి చూడని సుగాత్రి నాకేసి చూస్తోంది తరచుగా. పైగా అప్పుడప్పుడు ఆమె పెదవులు నవ్వుతున్నాయి కూడా... అయితే పరిహా సంగా మాత్రం కాదు!**

మీతో కొంచెం మాట్లాడాలి సాయంకాలం కాస్త నేతాజీ పార్కుకు వస్తారా? అని అడిగాను మా అమ్మకు విన్పించకుండా.

ఆమె బెదిరిపోయింది. పెద్ద పెద్ద కళ్ళతో భయం భయంగా చూసింది. జవాబు చెప్పకుండా వెళ్ళిపోయింది వేగంగా...

తను మా ఇంటికి వచ్చిన ప్రతి సారీ ఆ ప్రశ్ననే రిపీట్ చేయసాగాను.

చివరికి జవాబిచ్చింది ఆమె ఓ రోజు...

"పార్కుకయితే రాను! గుడికయితే వస్తాను!!"

వేణుగోపాలస్వామి ఆలయంలో కలుసుకోగలిగాం చివరికి ఓరోజు...

కోనేటి మెట్లమీద ఏకాంతంగా కూర్చున్నాక అడి గాను..

"నాకేసి చూసేవారే కాదు మునుపయితే... మరిప్పు డేమిటి?"

"ముందయితే భయం వేసేది!"

"భయమా? అదెందుకు??"

"మీరు హైక్లాసు వారు... మేం మధ్యతరగతి వాళ్ళం... నా చదువు మామూలు సైన్సు... మీ చదువూ గొప్పది... అందువల్ల ఎక్కడుండాల్సిన వారు అక్కడుం డాలి కద అని అన్పించేది!"

"పోనీ, ఇప్పుడు మేమేం దిగజారిపోయాం? మీరేం ఎగబ్రాకారని?"

"అదంతా నాకు తెలియదు.. మీకు జీతంలో పెద్ద కోత పడిందని తెలిసి జాలేసింది. మీరు సైకిలెక్కేసరికి బాధేసింది! అందుకని సానుభూతితో చూశాను.. అంతే!"

"అంతేనా? నన్ను చూసి నవ్వుతున్నారు కదా?!"

"ముందు కూడా నవ్వాలనిపించేది.. కానీ అప్పుడ యితే ధైర్యం చాలేది కాదు!"

"ఇంకా యేమనిపిస్తోందిప్పుడు?"

"మీకు మళ్ళీ జీతం పెరిగితే బావుండుననిపిస్తోంది.. మీరు మళ్ళీ దర్జాగా మోటారు సైకిలు మీద వెళ్ళా లనిపిస్తోంది!"

"అప్పుడు మళ్ళీ నన్ను చూసి భయపడ్తారు కదా?"

"నేను భయపడినా చింత లేదు మీరు మునుపట్లా ఉంటే బావుం టుంది!"

ఆమె అలా అనగానే నాలో ఏ మా రుమూలో ఏకాస్తో ఉండిన ఆత్మన్యూ నతా భావం పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది.

"అవన్నీ ఇప్పుడిప్పట్లో జరగవు కానీ... ఈ విషయం చెప్పండి... నేను ఎప్పటికీ సైకిలే త్రొక్కుతున్నా మీరు నన్ను పెళ్ళిచేసుకుంటారా?

"అమ్మో... భయం!" అందామె నిజంగానే భయప డిపోయి.

"భయమెందుకు?"

రెండు నిముషాల మౌనం తరువాత అందామె తల వంచుకుని... "మా తల్లిదండ్రులు, మీ తల్లిదండ్రులు ఒప్పుకుంటే!"

నేను గుండెల నిండుగా ఊపిరి పీల్చుకుని నిఠా రుగా లేచి నిలబడ్డాను... ఉత్సాహంగా! ★

**రచయిత చిరునామా:**
**టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి**
111-169-16, రామారావుకాలనీ,
మదనపల్లి- 517 325.
చిత్తూరు జిల్లా.ఆం.ప్ర.

